# నీతిలేని రాత్రి

కథానిక

"దారిద్ర్యం అనుభవిస్తేనే కాని తెలీదు దాని వల్ల బాధ. పుస్తకాల్లో చదివి గ్రహించడం ఒకవినోదం. కార్లలో తిరుగుతూ, కడుపునిండా తింటూ, కమ్యూనిజం ప్రచారించడానికి లెక్చెర్లిస్తారు. "వాడిగోళ్ళతో దారిద్ర్యం చీల్చే పేగుల్లోంచి కారే రక్తంగూర్చి. మొదటిసారిగా నాటకంవేసేవాడుకూడా తనపాత్రని ఇంతకన్నా బాగాపోషిస్తాడు. మరేజబ్బులేకుండా ఆకలి రోగంతో బాధపడేవాడి విషాద గాథని ఏ డాక్టరూ వినడు. మందివ్వడు. ఈరోగానికి మొదటిలక్షణం కడుపులోమంటలు. ఇవి చాలా త్వరగా మస్తిష్కం వరకూపాకి, నీతి, అవినీతి, సిగ్గు, భయం, మంచిచెడ్డలనే తారతమ్యగుణాలని మందగింపజేస్తాయి...వాసనలబట్టి ఆమడ దూరాన్న ఉన్న భక్ష్యపదార్థాలని సులభంగా పసికడతాడు. ఆకలితోచుట్టుకుపోతూన్న పేగులతో, సన్యాసి, తపశ్శాలి కుక్కపేగులు తిన్నాడంటే, చాంతాడంత చర్చలు సాగించారు దాని మీద వేదాంతులంతా. వీళ్ళందర్నీ ఒకగదిలో పెట్టి నాల్రోజులు తిండిపెట్టకపోతే "నరమాంసాన్ని గోళ్ళతో చీల్చుకుని పచ్చిది తినకూడదు"అని చెప్పడానికెంతమంది మిగుల్తారో! ఇవే ఆలోచనలతో కాళ్ళీడ్చుకుంటూ పరధ్యాన్నంగా పోతున్నాడు బడివైపు సీతాపతి. దగ్గర దగ్గర మూడేళ్ళబట్టీ క్షామదేవత తాండవంమొదలుపెట్టి సంఘానికి వెన్నెముకైన మధ్యతరగతి ప్రజని ఇలాంటి పరిస్థితికి తెచ్చింది.

బడిచేరి క్లాసులో ప్రవేశించాడు. పెంకులెగిరిపోతూ ఉండాల్సిన నాలుగో క్లాసులో తుమ్మెదలు ఝుంకారంకంటే తక్కువగాఉన్న శబ్దం కాస్తా మాష్టరురాగానే ఆగిపోయింది. చాలా మంది కుర్రాళ్లు ప్రయత్నంమీదనిలబడి కూర్చున్నారు. గౌరవంగా చినిగిపోతూన్న కోటు మేకుకుతగిలించి, చింకులుకనబడకుండా మడతలు పెట్టిన చీరముక్క కండువా దానిమీద జాగ్రత్తగా తగిలించాడు. కళ్ళజోడుతీసి తుడిచి తగిలించుకొని పుస్తకం తెరచాడు. కూర్చొని పాఠం చెప్పడానికి మనసొప్పలేదు. ముందుకొచ్చి, టేబిలుకి ఆనుకొని నిలబడి చాలామందికి చెప్పకుండానే అర్థమయే కుచేలుడిపాఠం తీశాడు. ఒకేగొంతుకతో అరగంట పాడేడుపాఠం. సగం పూర్తయింది. కుర్రాళ్ళు గ్రహిస్తున్నారో లేదో చూచేందుకు బలం, ఓపిక లేకపోయాయి. ఇంకా పది నిముషాలు మిగిలాయి.

"రామూ! కొర్రలెక్కడన్నా ఓరెండుసేర్లు దొరుకుతాయిరా?" అని అడిగాడు.

"సుబ్బిసెట్టిదగ్గరున్నాయిటండీ రూపాయికి మూడుపావులు." జవాబిచ్చాడు రాముడు. సరే లాభంలేదనుకూన్నాడు. మీరు తెచ్చిన కొర్రలుకూడా "నిండుకున్నాయి" అని చెప్పిన రాజ్యంమాటలు ఇంకా చెవుల్లో గింగురుమంటున్నాయి. గంటకొట్టారు. మూడోక్లాసుకి లెక్కలు. అర్థంలేని అంకెలు గుణించారు. మామిడిపళ్లు, వడ్లు, పాలు, ఎన్నో చవగ్గాఅమ్మేశారు, కొన్నారు లెక్కల్లో; కాని కొర్రల సమస్య ఎప్పట్లాగే ఉండిపోయింది. పాఠం పూర్తి చేశాడు. గొంతుకారిపోయి పిడచకట్టుకుపోయింది. నీళ్ళు అన్నవి కల్లోమాటలైయాయి. అందుకని వాటివిషయం అట్టే పట్టించుకోలేదు.

మరోగంట వినబడింది. క్లాసు వదిలేసి బయటకు బయలుదేరాడు. ఒకచెట్టుకింద ఇద్దరు పేపరు చూస్తున్నారు. పెద్దక్షరాలతో ఉన్న "అనంతపురం బళ్ళారి జిల్లాలలో కరువు ఆకటిచావులు"అని ఉంది. దానిక్రింద ఎవరో చూసొచ్చిన నాయకుడు "చావులు లేవు పరిస్థితి తీవ్రంగా ఉంది"అని స్టేట్మెంటు, చిరునవ్వుతో ఊరుకున్నాడు. గట్టిగా నవ్వితే ఆకలి-దాహం. లేకపోతే అట్టహాసంచేసి ఉండాల్సిందే! వీళ్ళ

"గోపి"

వాదవివాదాలు "చచ్చినకప్ప ములుగుతుందా. తేలుతుందా" అన్న పండితుల చర్చకంటే కొంచం విచిత్రంగా ఉంది" అని అనుకుని పత్రికకి కొంచం దూరంగా కూర్చున్నాడు. స్కూలు విడిచిన గంట గణగణమంది. గంటకి కొంచం ముందుగానే, చిప్పలు చేత్తోపట్టుకుని చీమల బారుల్లా నిలబడి ఉన్నారు పిల్లలు, సర్కారు వారి అంబటి సంతర్పణలో పాల్గొనడానికి. సీతాపతికి తన కడుపులోకూడా నాలుగు స్పూనులు వెయ్యాలని తెలుసు. మర్యాద మంటకలుస్తుంది, బహిరంగంగా తాగితే. పంచేముందర మంచినీళ్ల గ్లాసులో నింపి బ్లాకుబోర్డు వెనకాతలగా పెట్టి వచ్చాడు. పిల్లలకి పంచడం పూర్తయింది. తన క్లాసువాళ్ళని "నాకు తెలుసును, నీళ్ళు" అని చెప్పాలి. అందుకే తను అక్కడ ఉండాల్సింది. బడిమూయకుండా, గబగబా బ్లాకుబోర్డు వెనకాతల గ్లాసు పొట్టలోకి ఖాళీచేసి, చేతిరుమాలుతో జాగ్రత్తగా తుడిచి దాన్ని యథాస్థానంలో ఉంచి గృహోన్ముఖుడయ్యాడు ఎండలో కాళ్ళీడ్చుకుంటూ.

దారిపొడుగునా ఒకే ఆలోచన, "నలుగురు పిల్లలు, తను, భార్య, యీ కరువునెట్లాగ దాటేది" అని ఇంటికి రాగానే, కోటన్నా విప్పలేదు "కొఱ్ఱల మాటేమైంది" అని అడిగింది రాజ్యం. "తెస్తాను" అన్నాడు ముక్తసరిగా ముడివేసిన కనుబొమ్మలతో "తెస్తారు నే చచ్చిపోయాక" అంది సాగదీసుకుని రాజ్యం.
తనలో ఉండే పశుత్వం పైకి ఉబుకుతూంది. కొట్టాలన్న తీవ్రవాంఛని అరికట్టేందుగ్గా పళ్లు బిగించి "భోజనం పెట్టేదుందా లేదా?" అని హూంకరించాడు.

"ఆ మడికట్టుకోండి పిల్లలేదో ఎంగిలిపడ్డారు మీరునేనే ఉన్నాం" అంటూ చరిసగంచేసి అన్నీ వడ్డించింది. గజరాజు భోగాలా-కొఱ్ఱలు ఐతేనేం. ఆమెకాస్త ఎక్కువ పెట్టుకున్నట్టని పించింది. చిన్నపిల్లల్లా తగులాడన్నా ఒక కబళం సంగ్రహిద్దామనిపించింది సీతాపతికి "నీ ఊహ గ్రహించానుసుమా" అన్నట్లు నాలుక్కబళ్లాల్లో తినేసింది రాజ్యం. "హయో ఆకలి ఎంత నీచస్థితి కీడుస్తుంది ఎలా తప్పించుకోడం" అని అనుకున్నాడు చాలాసార్లు.

"సాయంకాలానికి కొఱ్ఱలులేవు గంటె పిండైనా తీసుకురండి అట్లుపోసుకుందాం" అని హెచ్చరిక చేసింది రాజ్యం.

"డబ్బో?" అన్నాడు సీతాపతి.

"నన్నడుగుతారేం?" అంది రాజ్యం.

"రెండు గాజుల్లో ఒకటిలా ఇవ్వు" అని అడిగాడు.

"ఊం హూ. వెండిపళ్లెం కావస్తే పెట్టండి వాడి యదాన" అని గట్టిగా చెప్పింది. ఇది ఇంట్లోని ఆఖరు విలువగల సామానులు "సరే" అన్నాడు పైకొచ్చేస్తున్న తన-పర భేదాలని అణగతొక్కి. గంటెపిండి, కొఱ్ఱలు, పప్పులు, నూనె, ఏవో ఒక అర్ధనెలగ్రాసం తెచ్చాడు నలుగురికీ. కంచం అమ్మినడబ్బుతో అయిదు రూపాయిలు వెనక్కుంచుకున్నాడు చేకాపుగా. పదార్థాలు తెచ్చిన మొదటిరోజుకదూ, అంతా తృప్తిగా తిన్నారు "కొరకొరలు" లేకుండా.

అంతా ఐనాక రాజ్యం చెంబుడు నీళ్ళల్లో సబ్బుకలిపి, ఒళ్లంతా శుభ్రపరుచుకొంది. మిల మిల లాడేకళ్లు, పచ్చటి దబ్బపండులాంటి శరీర చ్ఛాయ, పొడుగాటి జుత్తు, ఇవన్నీ ఎవరివో ఎప్పటివో అనిపించింది. యముకలు తాపీగా ఐయటికి కనబడుతూన్నాయి. "మళ్ళా ఎన్నాళ్ళకో ఈ స్నానం" అని తృప్తిగా అద్దం చూచుకుంది కొంతసేపు. గుడ్డిదీపం ముందుకూడా మిలమిల మెరుస్తున్నాయి, ఆమెకళ్లు.

సీతాపతి మంచందగ్గర చేరింది. నిద్రలో ఉన్నాయన్ని రెండు నిముషాలపాటు రెప్ప వెయ్యకుండా చూచి, ఒక నిట్టూర్పువిడిచి, మెల్లిగాతట్టి, "జరగండీ ఆసింటా" అంది.

"ఊం హూం" అన్నాడు, చాలాకాలానికి భరువెక్కిన కడుపువల్ల, నిండుగా వచ్చేనిద్దర్ని తరిమేయలేక. ఆమె వెచ్చటిశ్వాస ముఖానికి తగిలింది; మెత్తని ఆమెచేతులు బొచ్చుఛాతీమీద నృత్యం చేయడం మొదలుపెట్టాయి. మెల్లగా తన ఛాతీమీద సుఖమైన బరువు పడినట్లయింది. మత్తుపూర్తిగాపోయి సీతాపతి ఆమెని దగ్గరగా లాక్కున్నాడు.

"వెండికంచం ఎంతకమ్మారండీ?" అని మెల్లగా ప్రశ్నించింది.

"ఏం?"

"చెప్పకూడదా?"

"డెబ్భయి రూపాయిలు,"

"ఖర్చెంతైందిట?"

"డెబ్భయి. ఇంకా పాతబాకీ మూడురూపాయిలు అల్లాగే ఉన్నాయి." అన్నాడు ఏదో గ్రహించినట్టుగా.

"అబద్ధం, పొద్దున్న అరవై అన్నారుగా?"

"అరవై ఐదు నిజంగా, ఇంకా ఐదుమాత్రం ఉన్నాయి చిల్లరఖర్చుకి."

"పదిరూపాయలదాకా ఇరుగుపొరుగువాళ్ళకి ఇవ్వాలండీ అదెల్లాగు తీర్చేదిమరి?"అని చెవులో గుణిసిందామె.

"సరే దాంట్లో రెండు నువ్వుతీసుకో. కోటు మడతలో ఉన్నాయి."

"ఊహూఁ."

"పోనీ నువ్వు మూడుతీసుకో సరా" అంటూ దగ్గరికి లాక్కుంటే ఆమెచేతులని మెడకి మెలివేసింది.

మర్నాడు పొద్దున్న, రాత్రి మిగిలిన కొత్తిఅన్నంలో మజ్జిగతేట పోసుకుని, కాఫీనీళ్ళుతాగి బడికి బయలుదేరుతే ప్రాణం అంతగా 'ఉస్సూరు' మనలేదు. కుచేలుడి పాఠం కొంచం ఉత్సాహంగానే పూర్తిచేశాడు. పది నిముషాలకి బడి వదుల్తారనగా గ్లాసెక్కడుందో వెతుక్కుంటూ అనుకున్నాడు "కాలే కడుపుకి నీతుల్లేవు." ప్రతీ వ్యక్తి స్వార్థపరత్వంతో నిండిపోతాడు. తానాడే అబద్ధాలు, తన ప్రస్తుతపు ప్రవర్తన, మూడురూపాయిలకోసం రాజ్యం చేసిన వ్యభిచారం, "గాజులు కాదు పళ్ళెం"అని తనవాటియాదు చూపించిన ప్రత్యేకత, అన్నిటికంటే గ్లాసుడంబలికోసం తనుపడే తాపత్రయం, తలుచుకుంటూ విరిగిపోయిన కళ్ళద్దాల్లోంచి చూచాడు. మరో క్లాసులో, నారాయణ మాష్టరు అంబలిగ్లాసుమీద కాగితం మూతపెడుతూన్నాడు. ఒక్క చిరునవ్వుతో తన పనిలో మునిగిపోయాడు సీతాపతి.

---

# ఊహగానం

గోపాలశాస్త్రి

మాదీ-మీదీ-అంటూవుంటే,
ఇదీ-అదీ-ఏదీ, లేదోయ్!
మాదీ-మనదీ-అందరిదిన్నీ,
పదిమందిదిరా-అన్నాదూ?

లేకుంటే,

తట్టాబుట్టా, పట్టుకుపోవోయ్;
పెట్టెలు-బట్టలు-చీమలపుట్టలు బట్టును
అంటున్నా, రెంతోగట్టిగ!

ఎందుకూ?

కరుకూ, సరుకూ, లేనిది చెరుకూ—
పరుసూ, గడుసూ, లేనిది పడుచూ?
విసిరెయ్యాలీ—కసిరెయ్యాలీ!

అదుగో—

నల్లనల్ల నిశ వెనకాల,
మెల్లమెల్లగా అంకురిస్తోంది—
పిల్ల గాలికే కొట్టుకుపోతే;
ఎల్లా, బీజబలంలేని దెల్లా?

అందుకే—

జీవం పొయ్యాలి,
భావం మార్చాలి,

ఎన్నెన్నోవున్నయి, నిజమే,
అన్నిటినీ, మన్నించాలి—
కన్నామిన్నా తెలియనికాలం,
నిన్నానన్నా తెలియని వాంఛ!